తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
శుక్రవారం
10 జూలై 2026
పేజీలు : 08





# హబ్సిగూడ సీఎస్ఐఆర్-ఎన్జీఆర్ఐలో భూశాస్త్ర సాంకేతికతలపై ప్రత్యేక శిక్షణ

- పాల్గొన్న దేశవ్యాప్తంగా 23 మంది పరిశోధకులు
- రిమోట్ సెన్సింగ్, జీఐఎస్ అనువర్తనాలు
- ఉపగ్రహ చిత్రాలు, డిజిటల్ మ్యాపింగ్‌పై శిక్షణ
- యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్య సమన్వయం

**ఉప్పల్/హబ్సిగూడ, జూలై 9 (జనంసాక్షి):** హబ్సిగూడలోని సీఎస్ఐఆర్–జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ (ఎన్జీఆర్ఐ) ఆధ్వర్యంలో "భూపరితల ప్రక్రియల అధ్యయనం లో రిమోట్ సెన్సింగ్, భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్) అనువర్తనాలు" అనే అంశంపై జూలై 6 నుంచి 10 వరకు ఐదు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దేశంలోని ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలంగాణ విశ్వవిద్యాలయం, అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం, స్వామి రామానంద తీర్థ మరాత్వాడా విశ్వవిద్యాలయం, పండిట్ రవిశంకర్ శుక్లా విశ్వవిద్యాలయం, ఫరూక్ కళాశాల, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ పంజాబ్, సామ్ హిగ్గిన్‌బాటమ్ వ్యవసాయ, సాంకేతిక మరియు శాస్త్ర విశ్వవిద్యాలయం, బర్కతుల్లా విశ్వవిద్యాల యం తదితర సంస్థల నుంచి 23 మంది పరిశోధకులు, అధ్యాపకులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు.

సీఎస్ఐఆర్–ఎన్జీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్ కుమార్ ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ అభయ్ రామ్ బన్సల్, డాక్టర్ ఆనంద్ కుమార్ పాండే, డాక్టర్ ఈ.వి.ఎస్.కె. బాబు, డాక్టర్ నిలేష్ కుమార్ జైస్వార్, కార్యక్రమ సమన్వయకర్తలు డాక్టర్ సక్రం గుగులోతు, డాక్టర్ దినేష్ కుమార్ తదితర శాస్త్రవేత్తలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శిక్షణలో ఉపగ్రహ చిత్రాల విశ్లేషణ, భౌగోళిక సమాచార వ్యవస్థ వినియోగం, డిజిటల్ మ్యాపింగ్, భూపరితల మార్పుల గుర్తింపు, ప్రకృతి వైపరీత్యాల అంచనా, భూవినియోగ మార్పుల పరిశీలన, జలవనరుల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, భూభాగ ప్రణాళిక వంటి అంశాలపై సిద్ధాంత, ప్రాయోగిక శిక్షణ అందిస్తున్నారు. అత్యాధునిక సాఫ్ట్‌వేర్‌లతో ప్రత్యక్ష సాధన నిర్వహిస్తూ అనుభవపూర్వక శిక్షణ కల్పిస్తున్నారు. ప్రతి రోజు యోగా కార్యక్రమాలు నిర్వహించి శారీరక–మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. భూవిజ్ఞాన పరిశోధనల్లో ఆధునిక సాంకేతికతల వినియోగాన్ని విస్తరించడం, యువ పరిశోధకుల మధ్య శాస్త్రీయ సహకారాన్ని పెంపొందించడం ఈ శిక్షణ లక్ష్యమని సీఎస్ఐఆర్–ఎన్జీఆర్ఐ అధికారులు తెలిపారు.



### స్వచ్ఛతకు కాలనీ వాసుల

# స్వయం కృషి

**ఇందిరమ్మ రాజీవ్ గృహకల్ప కాలనీలో చెత్త డబ్బాల ఏర్పాటు**

**తాండూరు జులై 9(జనంసాక్షి) :** ప్రభుత్వం నుంచి అభివృద్ధి పనులు ఆలస్యమైనా, కాలనీని పరిశుభ్రంగా ఉంచుకోవడానికి స్థానికులు స్వయంగా ముందుకొచ్చారు. తాండూరు పట్టణం ఇందిరమ్మ రాజీవ్ గృహకల్ప కాలనీలో పారిశుధ్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని, కాలనీ వాసులు మరియు స్థానిక నాయకుల సహకారంతో పలు చోట్ల చెత్త డబ్బాలను ఏర్పాటు చేశారు. దీనివల్ల రోడ్లపై, ఖాళీ స్థలాల్లో చెత్త పడేయడం తగ్గి, కాలనీలో పరిశుభ్రత మెరుగుపడే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో భాగంగా డబ్బాలను ప్రారంభించిన కౌన్సిలర్ జావిద్ మాట్లాడుతూ అభివృద్ధి లేకపోయినా పరిశుభ్రత కోసం మేమే ముందుకొచ్చాం. ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూడకుండా, మన కాలనీని మనమే బాగు చేసుకోవాలి. చెత్తను డబ్బాలోనే వేసి, పరిశుభ్రతను కాపాడాలని ప్రతి ఒక్కరూ సహకరించాలి" అని పిలుపునిచ్చారు.కాలనీ వాసులు కూడా ఈ చొరవను స్వాగతించారు. ఇకపై క్రమం తప్పకుండా చెత్త సేకరణ జరిగేలా మున్సిపల్ అధికారులతో మాట్లాడతామని కౌన్సిలర్ తెలిపారు. స్వచ్ఛ భారత్ లక్ష్యానికి అనుగుణంగా ప్రజల భాగస్వామ్యంతోనే కాలనీలను ఆదర్శంగా తీర్చిదిద్దవచ్చని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# ఓటర్లు చురుకుగా భాగస్వాములు కావాలి

- మన్సూరాబాద్ డివిజన్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్
- ఓటరు వివరాలు సరిచూసుకోవాలని పిలుపు
- వారసత్వ ఓట్లు, కొత్త నమోదులకు సూచన
- భవానీనగర్ కాలనీలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ




**హయత్‌నగర్, జూలై 9 (జనంసాక్షి):** టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ శుక్రవారం మన్సూరాబాద్ డివిజన్‌లో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పరిశీలించారు. భవానీనగర్ కాలనీలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని సందర్శించిన ఆయన, బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు), బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు)తో సమావేశమై ఫారాల పంపిణీ ప్రక్రియ, పురోగతిని సమీక్షించారు.

ఈ సందర్భంగా ఓటర్లను ఉద్దేశించి మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన పెంపొందించుకుని ఓటరు నమోదు ప్రక్రియలో చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 2002 ఓటరు జాబితాను ప్రామాణికంగా పరిశీలించి తమ ఓటరు వివరాలను సరిచూసుకోవాలని, అవసరమైన సందర్భాల్లో తల్లిదండ్రుల వారసత్వ ఓటు వివరాలను సమర్పించి కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్ గౌడ్, రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు బుడ్డా సత్యనారాయణ, లింగాల కిషోర్, బద్దుల వేణు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్, కొల్లూరు శ్రీనాథ్, రాజేశ్వరి, భాను, రజిని రావు, దాము మహేందర్ యాదవ్, బాలకృష్ణ యాదవ్, విద్యా రెడ్డి, చర్ల రమేష్, కొండోజు శ్రీనివాస్, వినయ్ పటేల్, రవి తదితరులు పాల్గొన్నారు.

# టిపిటి బకాయిల విషయంలో రాష్ట్ర హైకోర్టు తీవ్ర అసహనం

### రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాకు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశాలు.. : రామకృష్ణ



**సికింద్రాబాద్ (జనంసాక్షి):** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన టిపిటి(ట్రాన్స్ఫర్ ఆఫ్ (ప్రాపర్టీ టాక్స్) బకాయిల విషయంలో రాష్ట్ర హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసినట్లు మాజీ కంటోన్మెంట్ ఉపాధ్యక్షుడు జె.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మహేంద్ర హిల్స్‌లోని ఆయన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కంటోన్మెంట్ బోర్డుకు గత కొన్నేళ్లుగా రావాల్సిన టిపిటి బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో అభివృద్ధి పనులు పూర్తిగా కుంటుపడ్డాయని, దీనిపై తాను ఇటీవల హైకోర్టును ఆశ్రయించానని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం వివరణ ఇవ్వాలని, ప్రతి గడువుకు హాజరుకావాలని కోర్టు స్పష్టం చేసినట్లు ఆయన వివరించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి కంటోన్మెంట్ అభివృద్ధి విషయంలో చిత్తశుద్ధి లేదన్నారు. కేవలం మొసలి కన్నీరు కారుస్తూ పాలనను విస్మరించాయని రామకృష్ణ విమర్శించారు. కంటోన్మెంట్‌లో జరుగుతున్న పనులన్నీ కేవలం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే సాగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న టిపిటి బకాయిలను విడుదల చేయాలని, కేంద్రం నుండి రావాల్సిన సర్వీసు చార్జీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందుకోసం తాను ఇప్పటికే పలుమార్లు ఢిల్లీలో డీజీడీఈ అధికారులను కలిసి విన్నవించినట్లు తెలిపారు. కంటోన్మెంట్ పరిధిలో నిలిచిపోయిన ఎస్ఐఆర్ ప్రక్రియను పునరుద్ధరించాలని, బిఎల్వోలకు నెలల తరబడి జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నందున వారికి వెంటనే బకాయిలు చెల్లించి న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# కుషాయిగూడలో చార్టర్డ్ అకౌంటెంట్స్ కార్యాలయం ప్రారంభం



**కాప్రా, జూలై 9 (జనంసాక్షి):** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గురువారం కుషాయిగూడ లోని ఎస్. అనిల్ కుమార్ కో చార్టర్డ్ అకౌంటెంట్స్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యువ పారిశ్రామికవేత్తలు, వృత్తి నిపుణు లు తమ సేవలను విస్తరించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యాలయం విజయవంతంగా కొనసాగి మంచి సేవలు అందించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, హమాలీ శ్రీనివాస్, ఎస్. అనిల్ కుమార్, ఎస్. సైదారావు, జిడ్డు అంకరాజు, ప్రశాంత్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనాలు అమలుపరచాలి

## ఏఐటిసి రాష్ట్ర అధ్యక్షులు యేసు రత్నం




**నిజాంపేట్ జూలై 9 (జనం సాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ సర్కిల్ ఎఐటియుసి మండల 4వ మహాసభ ఆసియాదయ్య అధ్యక్షతన గురువారం నిజాంపేట్ ఎస్సి కమ్యూనిటీ హాల్ నందు నిర్వహించారు. ఈ మహా సభలకు ముఖ్య అతిథులుగా ఏఐటిసి రాష్ట్ర అధ్యక్షులు యేసు రత్నం, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర మున్సిపల్ సంఘం కార్యదర్శి జైపాల్ రెడ్డి , రాష్ట్ర ,ఎఐటియుసి ఉపాధ్యక్షులు పాలబిందల శ్రీనివాస్ ,మున్సిపల్ సంఘం జిల్లా అధ్యక్షులు హరినాథరావు లు పాల్గొని మాట్లాడుతూ సాతంత్రానికి పూర్వం నుండే కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం 4 లేబర్ కోడ్స్ రూపంలో తీసుకొచ్చి కార్మిక హక్కులను ,యూనియన్లు పెట్టుకోకుండా, సంబంధిత యాజమాన్యాలతో కార్మిక బేరసారాల సంప్రదింపులు లేకుండా చేయడమే కాకుండా పిక్స్ టైమ్ కాల పరిమితి తో కూడుకున్న విధానం తీసుకువచ్చారని తెలిపారు. అలాగే కనీస వేతనం 26000రూపాయల జీతం సుప్రీంకోర్టు ఆదేశాలు మేరకు చెల్లించాలని తెలియజేసిన రాష్ట్ర కేంద్ర ప్రభుత్వంలు అమలు చేయడం లేదని తెలిపారు.

ఎఐటియుసి యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులందరిని పోరాటాలకు సిద్ధంకావాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ నెల 11 తేదీ యాప్రాల్ నందు జరిగే మేడ్చల్ జిల్లా 4వ మహాసభ లో భవిషత్ కార్యక్రమాలకు రూపకల్పన చేసుకొని కార్మికులకు న్యాయం చేసే వరకు ఎఐటియుసి నాయకులు ముందుండాలని పిలుపునివ్వడం తెలిపారు. ఈ మహాసభ లో నాయకులు దస్తగిరి, బాగ్యమ్మ, పుష్ప, దుర్గయ్య పాల్గొన్నారు. నిజాంపేట్ ఎఐటియుసి అధ్యక్షులుగా మేకల బాలకృష్ణ, మండల కార్యదర్శిగా ఆశి యాదయ్య, కన్వీనర్గ దస్తగిరి లను ఎంపిక చేశారు.

# రామంతపూర్‌లో ప్రజల సమస్యలపై ఎంఎంసీ కమిషనర్





- పౌర సేవల మెరుగుదలకు కీలక ఆదేశాలు
- తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలపై దృష్టి
- చెత్త, నిర్మాణ వ్యర్థాల తొలగింపుకు సూచనలు
- ప్రజలతో మమేకం.. పరిపాలన పారదర్శకం

**ఉప్పల్/రామంతపూర్, జూలై 9 (జనం సాక్షి):** ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) కమిషనర్ రామంతపూర్ ప్రాంతంలో స్థానిక నివాసితుల తో నేరుగా సమావేశమయ్యారు. ప్రజలు ఎదుర్కొంటున్న పౌర సమస్యలను విని, ప్రాంతంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ప్రజలు తెలిపిన సమస్యలను ఓపికగా విన్న కమిషనర్, తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారు లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదును నిర్దిష్ట గడువులో పరిష్కరించి, చేపట్టిన చర్యలపై ప్రజలకు సమాచారం అందించాలని ఆదేశించారు.

పటేల్‌నగర్ ప్రాంతంలో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించిన కమిషనర్, చెత్త సేకరణ కేంద్రాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని, నిర్మాణ వ్యర్థాలను సకాలంలో తరలించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా పర్యవేక్షణను బలోపేతం చేయాలని, పారిశుద్ధ్య సిబ్బందితో నిరంతరం పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవడం ద్వారా పరిపాలనను పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కమిషనర్ పేర్కొన్నారు. "ప్రజలు ముందుగా... సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యం" అనే నినాదంతో పౌరుల సమస్యలకు వేగంగా స్పందిస్తామని స్పష్టం చేశారు. నగర పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ప్రాంతంలో క్షేత్రస్థాయి తనిఖీలు కొనసాగుతాయని, నిర్లక్ష్యం చూపిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఆషాడ జాతర ఏర్పాట్లపై నేడు సమీక్ష సమావేశం

## హాజరు కానున్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్

**సికింద్రాబాద్ (జనంసాక్షి):** సికింద్రాబాద్ శ్రీఉజ్జయిని మహాకాళి ఆషాడ జాతర-2026 ఏర్పాట్ల పై అన్ని ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలతో శుక్రవారం అమ్మవారి ఆలయంలో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సు రేఖ,రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఈ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమా వేశానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (దేవాదాయ శాఖ) శైలజా రామయ్యర్ కూడా హాజరుకానున్నారు. జాతర నిర్వహణకు సంబంధించి వివిధ శాఖల సమన్వయం, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రత, పారిశుధ్యం, ట్రాఫిక్, తాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించ నున్నట్లు ఆలయ కార్యనిర్వ హణాధికారి జి. మనోహర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు హాజరు కావాలని ఆలయ అధికారులు కోరారు.

# సర్‌లో పాల్గొనండి.. ఓటును కాపాడుకోండి

## స్వయంగా ఎన్యుమరేషన్ ఫారం నింపి అవగాహన కల్పించిన సర్పంచి దేవి రాంచరణ్



**జిల్లేడు చౌదరి గూడెం:** దేశవ్యాప్తంగా కొనసాగుతున్న సర్ ప్రోగ్రాం లో ప్రతి ఒక్కరు వివరాలు తెలిపి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని చింతకుంట సర్పంచి దేవి రాంచరణ్ కోరారు. గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచి దేవి రాంచరణ్ స్వయంగా సర్ ప్రోగ్రాం లో పెనుమరేషన్ ఫారాలు నింపుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెనుమరేషన్ ఫారాలు తప్పనిసరిగా ప్రతి ఒక్కరు 2002 ఓట్లను జాబితాలో ఉన్న వివరాలను అందించాలని సూచించారు లేకపోతే మ్యాపింగ్ చేయడంలో అధికారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గడువులోగా ఓటర్లు సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు లేకుంటే వచ్చే ఎన్నికల్లో ఓటు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఎల్వోలు నవీన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్, అంగన్వాడీ టీచర్ వసంత, బిల్ఏ వినోద్ నాయక్, గ్రామస్తులు రాంచరణ్, ఆదిత్య, అనీల్, తులసీ రాం, హన్మంత్, సేవ్య, శివరాం, గోవింద, మంగ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పై బీఆర్ఎస్ పార్టీ బిఎల్ఎలకు అవగాహన సదస్సు

## షాబాద్ మాజీ జడ్పిటిసి సభ్యులు పట్నం అవినాష్ రెడ్డి

**షాబాద్, జులై 09(జనం సాక్షి) :** ఎస్ఐఆర్ కార్యక్రమంలో పొరపాట్లులేకుండా బిఎల్ఏ లు తగు జాగ్రత్తలు పాటించాలని షాబాద్ మాజీ జడ్పిటిసి సభ్యులు పట్నం అవినాష్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వారి నివాసంలో బీఆర్ఎస్ పార్టీ బిఎల్ఏ లకు ఎస్ఐఆర్ కార్యక్రమం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... గ్రామాల్లో పార్టీ బిఎల్ఏలు ఎస్ఐఆర్ కార్యక్రమంలో పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఆర్ కార్యక్రమ ఇంచార్జ్ రాంబాబు యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్ రావు, మాజీ ఎంపీపీ కూర వెంకటయ్య, పార్టీ నాయకులు రాజేందర్ రెడ్డి, మద్దూరు పాండు, భూపాల్ రెడ్డి, పలు గ్రామాల బిఎల్ఏలు తదితరులున్నారు.

# 13న టిడబ్ల్యూ జేఎఫ్ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట నిరసన


## 15న సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా



**మల్కాజిగిరి జూలై 9 (జనంసాక్షి) :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ టిడబ్ల్యూ జెఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా 13న మేడ్చల్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ టీడబ్ల్యూజేఎఫ్ మల్కాజిగిరి నియోజవర్గ కన్వీనర్ సుధాకర్ పిలుపు నిచ్చారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మరింత చొరవ చూపాలని అభిప్రాయపడ్డారు. ఈనెల 13న జిల్లా కలెక్టర్ కు వినతిపత్రాలు అందజేసి నిరసనలు, 15న రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. జర్నలిస్టుల హెల్త్‌కార్డుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. హెల్త్ కార్డులు నిమ్స్ ఆస్పత్రి మినహా ఏ ఇతర కార్పొరేట్ ఆస్పత్రుల్లో పని చేయడం లేదని మండిపడ్డారు. వెంటనే జర్నలిస్టులందరికీ నూతన హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయంలో క్యాబినెట్ సబ్ కమిటీ ఇండ్ల స్థలాలపై నిర్ణయం తీసుకోకపోవడంతో కార్యాచరణ ముందుకు సాగడం లేదని అన్నారు. ఇండ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం జర్నలిస్టులకు ఆశలు కల్పించి ఆ తర్వాత వారి ఆశలపై నీళ్లు చల్లుతోందని విమర్శించారు. అక్రిడిడేషన్ కార్డుల పంపిణీ ఆలస్యమవుతున్నదని, అర్హులైన జర్నలిస్టులకు వెంటనే అక్రిడిడేషన్ కార్డులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అక్రిడేషన్ కార్డులు ఆలస్యం కావడంతో బస్‌పాసులు రాక జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తేచేశారు. జర్నలిస్టులకు పెన్షన్ 10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు వంద శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని కోరారు. దీనిపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

# రైతులకు అదనపు ఆదాయం.. సన్న వరి సాగుకు బోనస్

- క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటన
- ప్రాధాన్యత రకాలు సాగు చేస్తే మేలు
- ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి
- ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలి



**షాబాద్, జూలై 9 (జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్న వరి సాగును ప్రోత్సహించేందుకు రైతులకు అదనపు ఆదాయం కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తుందని మండల వ్యవసాయ అధికారి విజయచంద్ర తెలిపారు. గురువారం పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, వరి రకాలను సాగు చేసిన రైతులకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ సోనా), బీపీటీ 5204 (సాంబా మసూరి), కేఎన్ఎం 16384, హెచ్ఎంటీ సోనా, జైశ్రీరామ్, జీఎల్44, కేఎన్ఎం 7715 రకాలను సాగు చేసిన రైతులు బోనస్ పొందవచ్చన్నారు.

ఈ రకాలు సాగు చేసిన రైతులు తమ పంట వివరాలను వరి విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ల ద్వారా ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు చేసుకున్న వివరాలను ప్రభుత్వానికి పంపి, పంట కొనుగోలు సమయంలో బోనస్ మొత్తం నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని తెలిపారు.

అందువల్ల ఆయా ప్రాధాన్యత వరి రకాలు సాగు చేసిన రైతులు వెంటనే ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలని కోరారు. షాబాద్, నాగర్ గూడలోని పలు విత్తన దుకాణాల్లో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఇందులో భాగంగా ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విజయచంద్ర తెలిపారు. దేశంలో ప్రతి పౌరుడికి ఆధార్ కార్డు ఇచ్చినట్లుగా ప్రతి రైతుకు 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించే కార్యక్రమం అమలు చేస్తున్నట్లు చెప్పారు. భూమి కలిగిన ప్రతి రైతు భూ యాజమాన్య వివరాలు, వ్యక్తిగత సమాచారం ఆధారంగా ఫార్మర్ రిజిస్ట్రీ రూపొందించనున్నారు. పీఎం కిసాన్ పథకం లబ్ధి, రైతు భరోసా, రుణమాఫీ, ధాన్యం కొనుగోలు, ఎరువుల బుకింగ్ వంటి పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టం చేశాయన్నారు. ఆధార్ కార్డు, భూ యాజమా న్య పాస్‌బుక్, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో మీసేవ కేంద్రాలు లేదా వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. షాబాద్ మండలంలో మొత్తం 27,843 పట్టాదారులు ఉండగా, 17,350 మంది ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, మిగిలిన 10,493 మంది రైతులు వెంటనే నమోదు చేసుకోవాలని విజయచంద్ర పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

### ఎన్‌ఎంసిలో చెత్త తరలింపుకు సంబంధించిన

# చెల్లింపులపై సమగ్ర విచారణ జరిపించాలి

**సామాజిక కార్యకర్త ఆకుల సతీష్**



**నిజాంపేట్ జూలై 9 జనం సాక్షి :** కుతుబుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ కార్పొరేషన్‌లో రూ.3.40 కోట్ల చెల్లింపుల వ్యవహారంపై ఏసీబీతో సమగ్ర విచారణ జరిపించాలని ఈ అక్రమ చెల్లింపుల కు సంబంధించి ఇందులో ప్రమేమున్న వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కుల సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంపేట్ కార్పొరేషన్‌లో డంపింగ్ యార్డు నుంచి చెత్త తరలింపు పనులకు సంబంధించి జేఎంసీ కన్స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెల్లించాల్సిన రూ.3.40 కోట్ల చెల్లింపులు ధీరజ్ కు చెందిన బినామి కంపెనీ (జేఎంసి కన్స్ట్రక్షన్స్) అక్రమ చెల్లింపుల వ్యవహారంలో జరిగినట్లు ఆరోపణలు వెల్లువొత్తాయని, ఈ అవకతవకలపై విచారణ అనంతరం సిఎంసి కమిషనర్ డీఈ ధీరజ్‌ను (ఎస్‌ఎండిపి శేర్లింగంపల్లి) వారు సస్పెండ్ చేయడం స్వాగతి ంచదగిన చర్య అని ఆకుల సతీష్ తెలిపారు. అయితే, ఈ వ్యవహారం లో పరోక్షంగా సహకరించారని ఆరోపణలు ఎదుర్కొంటు న్న ఎస్సీ సత్యనారాయణ, చెక్కులు జారీ చేసిన మాజీ కమిషనర్ రామకృష్ణ, ప్రస్తుత డిప్యూటీ కమిషనర్ సాబీర్ అలీ, అకౌంటెంట్ మునీమ్‌లపై కూడా సమగ్ర విచారణ జరిపి, అవసరమైతే వారిని సస్పెండ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అంశంపై 12-06-2026న సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజా ధనానికి సంబంధించిన అవకతవకల్లో పాల్పడినట్లు ఆరోపణలు ఉన్న అధికారులపై కేవలం శాఖాపరమైన చర్యలకే పరిమితం కాకుండా, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)తో స్వతంత్ర విచారణ జరిపించాలని కోరారు. ఇలాంటి చర్యలు తీసుకోవడం వల్ల భవిష్యత్తులో అధికారులు అక్రమాలకు పాల్పడకుండా నిరోధించవచ్చని ఆకుల సతీష్ పేర్కొన్నారు.

## ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, స్టేషనరీ విక్రయిస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలి: ఎస్‌ఎఫ్‌ఐ



**అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 9(జనంసాక్షి):** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లో పుస్తకాలు, స్టేషనరీ విక్రయిస్తూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూరులోని ఆర్చిడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ పుస్తకాలు, స్టేషనరీ విక్రయిస్తున్నారని, విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని మండల విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వారు పాఠశాలలో తనిఖీలు నిర్వహించి పుస్తకాలు, స్టేషనరీ నిల్వ ఉంచిన గదిని సీజ్ చేసినట్లు తెలిపారు. విద్యను వ్యాపారంగా మార్చే ధోరణిని ప్రభుత్వం అరికట్టాలని, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు పాషా, నరేందర్, హరీష్, శశి, సాయి, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

# మహర్షి విద్యాలయ నూతన భవనం ప్రారంభం

- **విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి : ఎమ్మెల్యే కాలే యాదయ్య**



**చేవెళ్ల, జూలై 09 (జనంసాక్షి):** మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందించడమే విద్యాసంస్థల లక్ష్యంగా ఉండాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మ్యున్సిపల్ కేంద్రంలో నూతనంగా నిర్మించిన మహర్షి విద్యాలయ భవనాన్ని గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచి, ప్రస్తుత కౌన్సిలర్ బండారు శైలజ అగిరెడ్డి, పాఠశాల చైర్మన్ చిరుమని జైపాల్‌రెడ్డి, కరస్పాండెంట్ ప్రభాకర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గంలో కార్పొరేట్ స్థాయి వసతులతో విద్యాసంస్థలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. పుస్తకాలకే పరిమితమైన విద్య కాకుండా విద్యార్థులను సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత యాజమాన్యాలు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహర్షి విద్యాలయం చేవెళ్ల ప్రాంతంలో మంచి గుర్తింపు సాధించాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు విద్యాసంస్థలే బలమైన పునాది అని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే నూతన భవనంలోని తరగతి గదులు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ తాండూరు నగర శాఖ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**తాండూరు జులై 9(జనంసాక్షి) :** ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థ అయిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని తాండూరు నగర శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజయ్ కుమార్ మాట్లాడుతూ 1949 జూలై 9న జ్ఞానం శీలం ఐక్యత అనే మూలసూత్రాల తో స్థాపించబడిన ఎబివిఫి, దేశభక్తి, సేవాభావం, విద్యార్థి సంక్షేమం, జాతీయ పునర్నిర్మాణం లక్ష్యాలతో పనిచేస్తుందని, ఎబివిపి కేవలం విద్యార్థి సమస్యలకే పరిమితం కాకుండా, సామాజిక సేవ, రక్తదాన శిబిరాలు, ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక చర్యలు, పర్యావరణ పరిరక్షణ, జాతీయ సమైక్యత వంటి అనేక రంగాల్లో సేవలు అందిస్తోందని తెలిపారు. స్వామి వివేకానంద, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకొని, నేటి యువతలో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఎబివిపి నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేశసేవ, విద్యార్థి సంక్షేమం, జాతీయ చైతన్యానికి అంకితమై పనిచేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు నవీన్ గౌడ్, పవన్ కుమార్, రాజేష్, ప్రకాష్, లాలూ ప్రసాద్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘూటింగ్ బాల్‌లో తెలంగాణ తరపున విజయం సాధించిన నేనావత్ వందన

### ఘనంగా సన్మానించిన డిసిసి అధ్యక్షులు ధారా సింగ్, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్

దౌల్తాబాద్, జనంసాక్షి :వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం పోల్కంపల్లి గ్రామపంచాయతీ సేవ బండతండాకి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు సేవ్యానాయక్ కృష్ణవేణి దంపతుల రెండవ సంతా నం నేనావత్ వందన. ఘూటింగ్ బాల్ లో తెలంగా ణ తరపున ఆడి పాండి చ్చేరిపై విజయం సాధించి మూడో స్థానంలో కాస్య పత కం సాధించిన నేనావత్ వందనకు సిఎం రేవంత్ రెడ్డి నివాసం కొడంగల్ లో మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, వికారాబాద్ డిసిసి అధ్యక్షులు ధారాసింగ్ చేతుల మీదుగా ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షులు అంబ య్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలి

**మండల విద్యాధికారి అశోక్**

**మర్పల్లి జూలై 09 (జనం సాక్షి) :** ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని మండల విద్యాధికారి అశోక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మొగిలిగుండ్ల, కొంశెట్ పల్లి లోని తెలుగు మీడియం ఉర్దూ మీడియం పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించే విధానాన్ని ఆయన గమనించారు. పిల్లల యొక్క నోట్ బుక్స్ వర్క్ బుక్స్ పిల్లలనుండి తీసుకొని వారి వారి రైటింగ్ ని గమనించి బాగుందని ప్రశంసించారు. పిల్లలకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, మొగిలి గుండ్ల సర్పంచ్ రచన్న, లావణ్య, శోభా, నూరుద్దీన్ పాల్గొన్నారు.

# గృహాల నిరుపయోగ వ్యర్థాల సామాగ్రి ప్రత్యేక సేకరణ కార్యక్రమం

**నిజాంపేట్ జూలై 9 జనం సాక్షి :**
కుత్బుల్లాపూర్ జోన్, కొంపల్లి సర్కిల్ -56 పరిధిలో పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పడం గృహాల నుండి వెలువడే భారీ వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు ప్రతి నెల బల్క్ వ్యర్థాల సామాగ్రి తదితర వ్యర్థాలను తరలించే ప్రత్యేక సేకరణ కార్యక్రమం చేపట్టనుందని, సర్కిల్ ప్రజలు వినియోగించుకొని పాత పరుపులు మంచాలు సామాగ్రి వస్తువులు రోడ్డుకిరు ప్రక్కల రోడ్లపై పడవేయకుండా ప్రతి కుటుంబంలోని నిరుపయోగ సామాగ్రి తరలించేందుకు మున్సిపల్ వారి చెంతకే చేరవేసే విధంగా ఉండేందుకు ఉపయోగించుకొని ఇంటితోపాటు పరిసర పరిశుభ్ర వాతావరణం కు సహకరించాలని డిప్యూటీ కమిషనర్ లావణ్య తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ పౌరులు తమ ఇళ్లలో వినియోగంలో లేని పాత సోఫాలు, మంచాలు, పరుపులు, కుర్చీలు, టేబుళ్లు, చెక్క సామగ్రి ఇతర భారీ గృహ వ్యర్థాలను నిర్ణీత తేదీలలో, నిర్ణీత ప్రదేశాలలో అందజేయవలసిందిగా తెలిపారు.

**ఇట్టి కార్యక్రమం ప్రతి నెల శనివారాలలో క్రింది విధంగా నిర్వహించబడుతుంది:**

1వ శనివారం: వార్డు నెం. 290 - సుభాష్ నగర్‌లోని వెంకటాద్రి నగర్, గంపల బస్తీ, సూర్యనగర్, ఫేజ్-2, పైప్‌లైన్



రోడ్ ప్రాంత నగర వాసులు సేకరణ కేంద్రం: సుభాష్ నగర్ వార్డు కార్యాలయం నందు భారీ గృహ వ్యర్థాలను అందజేయగలరు.

2వ శనివారం: వార్డు నెం. 290 - సుభాష్ నగర్ లోని జేకే నగర్, కృష్ణమూర్తి నగర్, భాగ్యలక్ష్మి నేతాజీ స్కూల్ పరిసరాలు, సుభాష్ నగర్ ఫేజ్-1, ఐమాత ఆలయ ప్రాంతం, భాగ్యలక్ష్మి కాలనీ నగర వాసులు సేకరణ కేంద్రం: భాగ్యలక్ష్మి కాలనీ సాయిబాబా దేవాలయం వెనక వున్న స్థలము నందు భారీ గృహ వ్యర్థాలను అందజేయగలరు.

3వ శనివారం: వార్డు నెం. 292 - సాయిబాబా నగర్ లోని భవాని నగర్, సిద్ధివినాయక నగర్, రాజుస్వామి నగర్ బస్తీ, తెలుగు తల్లి నగర్, కట్ట మైసమ్మ మెయిన్ రోడ్, మార్కెట్ రోడ్ (మసీదు ప్రాంతం), రాజీవ్ గృహకల్ప, ఆశ్రమం రోడ్, రాజిరెడ్డి నగర్, పండు బస్తీ, దయానంద్ నగర్, సుందర్ నగర్, ముత్తయ్య నగర్, సూరారం కాలనీ మరియు వీడీఆర్ స్ట్రీట్ నగర వాసులు సేకరణ కేంద్రం: రామలీలా మైదానం ఎదురుగా వున్న స్థలము నందు భారీ గృహ వ్యర్థాలను అందజేయగలరు.

4వ శనివారం: వార్డు నెం. 292 - సాయిబాబా నగర్ లోని సాయిబాబా నగర్, ఎస్.ఆర్. నగర్, నరసింహ బస్తీ, ముత్యాల బస్తీ, హమీద్ బస్తీ, ఎస్.ఆర్. నాయక్ నగర్, అపూర్వ కాలనీ, చర్చ్ గల్లి రామిరెడ్డి నగర్ నగర వాసులు సేకరణ కేంద్రం: ఎస్.ఆర్. నాయక్ నగర్ గ్రౌండ్ నందు భారీ గృహ వ్యర్థాలను అందజేయగలరు. ఈ కార్యక్రమంలో భారీ గృహ వ్యర్థాలను మాత్రమే అందజేయవలెను. సాధారణ ఇంటి చెత్త, నిర్మాణ వ్యర్థాలు (సి అండ్ డి), తోటల వ్యర్థాలు ప్రమాదకర వ్యర్థాలను ఈ కార్యక్రమం కింద స్వీకరించబడవు. ప్రజలందరూ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో సైబరాబాద్ మునిసిపల్ కార్పోరేషన్ కు సహకరించవలసిందిగా కోరడమైనది. ప్రజల సహకారంతో కొంపల్లి సర్కిల్‌ను మరింత పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన హరిత ప్రాంతంగా సమన్వయంతో తీర్చిదిద్దుకోగలమని తెలిపారు.